

# 1999 జనవరి 3వ తేదీన
# భగవాన్ శ్రీరమణమహర్షుల వారి
# 119 జయంతి సందర్భమును
# పురస్కరించుకొని
# ఈ వ్యాసము వ్రాయబడినది.

డా॥ K. రామారావు

# ది రియల్ సోషలిష్టు భగవాన్ శ్రీరమణ మహర్షి

1879 డిశంబరు 29 రాత్రి ఒంటిగంటకు తమిళనాడులోని మధురైక్షేత్రానికి ముప్పదిమైళ్ల దూరములోనున్న "తిరుచ్చుళి" అను శివక్షేత్రమున "అళగమ్మ - సుందరమయ్యర్" అను బ్రాహ్మణదంపతుల యింట ఒక బాలుడు అవతరించాడు. అళగమ్మ గర్భములోనుండి ఒక కాంతిపుంజము బయటికి వచ్చి - అది బాలుని ఆకృతి ధరించినట్లు పురిటిగదిలోనున్న ఒక గుడ్డి అవ్వకు గోచరించినది.

మతాల పేరుతో మారణహోమాలు సృష్టించుకుంటూ, కులాలపేరుతో కుమ్ములాడు కుంటూ, కుటిల రాజకీయాలతో భ్రష్టుపట్టిన ఈ సమాజానికి వెలుగుచూపుటకోసము - మరుగున పడిపోతున్న జ్ఞానమార్గాన్ని పునరుద్ధరించి, "నేనెవ్వడను?" అను విచారణ మార్గాన్ని బోధించి, నవయుగానికి నాందిపల్కిన అవతారపురుషుడు భగవాన్ శ్రీ రమణమహర్షుల వారే - ఆ బాలుడు !

ఆధ్యాత్మిక జగత్తుకే ఆయన ఒక "హెర్క్యులెస్" లాంటివాడని అరవిందయోగులంతటివారు చెప్పారు. "పూర్వపు ఋషులెవరితోనైనా భగవాన్ శ్రీరమణ మహర్షిని మీకు పోల్చాలని అనిపిస్తే - ఒక్క శుకమహర్షి తప్ప మరొకడు ఈసృష్టిలో లేడు" అని మన మాజీ రాష్ట్రపతి డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పారు.

భగవాన్‌కి తల్లిదండ్రులు పెట్టినపేరు వెంకట్రామన్. బాల్యములో ఆయన మంచి ధృఢకాయుడు. చదువుకంటే ఆటలు ఈతలు అంటే ఆయనకు మిక్కిలి యిష్టం. ఆతని నిద్ర కడు విచిత్రమైనది. నిద్రపోతుండగా తోటి బాలురు కసి తీర్చుకొనుట కోసము కొట్టినా ఆయనకు మెలుకువ వచ్చేదికాదట - మరి అది యేమి యోగనిద్రో !

భగవాన్ చిన్నవయస్సులో ఉండగానే తండ్రి చనిపోయాడు. ఆయన చదువు నిమిత్తము మధురైలోని పినతండ్రిగారి యింటికి వచ్చారు. అక్కడ అరువది ముగ్గురు శివభక్తుల చరిత్రను వివరించే "పెరియపురాణం" అనే ఆధ్యాత్మిక గ్రంథాన్ని చదివారు. "అందులో ఒకడుగానైనా నేను కాగలనా?" అని అనుకున్నారు. మరికొద్ది రోజులలో తన దగ్గరి బంధువుద్వారా "అరుణాచలం" అన్న పేరు విన్నారు. అరుణాచలం పేరువినగానే ఆయనకు దేవుడు గుర్తుకు వచ్చాడే గాని - అది "స్మరణ మాత్రముననే అహంకారమును హరియించు గొప్ప శివక్షేత్రమని, అది లింగమని, అగ్ని లింగమని" ఆయనకు తెలియదు. భగవంతుని దగ్గర ఉండి మనిషి రావటం ఏమి టి? అని నివ్వెర పోయాడట! మరి ఆది ఏజన్మసంబంధమో!

ఆయన మధురైమిషన్ హైస్కూలులో 10వ తరగతి చదువుకుంటున్న రోజులవి. 1896 జులై 16వ తేదీన తాను మేడమీద గదిలో ఒంటరిగా మెలుకువగానున్న సమయములో -

తాను పరిపూర్ణమైన ఆరోగ్యముతోనుండగా - మనస్సులో ఏవిధమైన ఆవేశముగాని, ఆవేదనగాని, ఆందోళనగాని లేని ప్రశాంత సమయములో మరణము ముంచుకు వచ్చినది. శ్వాస స్థంభించిపోయినది. గుండె ఆగిపోయినది. రక్తప్రసరణ నిలిచిపోయినది. కనులు మూతబడినవి. పెదవులు బిగుసుకుపోయినవి. కాళ్లుచేతులు కొయ్యబారిపోయినవి. శరీరము శవమైనది. శరీరము శవమైనప్పటికి శరీరముతోటి ఇసుమంతయు సంబంధములేని సద్వస్తువు ఒకటి ఆయనకు స్ఫురించినది. శరీరముతోటి సంబంధము తెగిపోయినప్పటికి తన అస్తిత్వమునకు అనుమాత్రము కూడ లోటు ఆయనకు కనిపించలేదు. ఆత్మస్ఫురణ సుస్పష్టముగా ఉన్నది. ఈ దేహము ఒక జడమని, దానికి తానున్న సంగతే తెలియదని, అట్టి దేహము - తాను కాదని, తాను నాశనములేని సద్వస్తువునని తెలుసుకున్నాడు. ఇది ఆయన ఊహకు సంబంధించిన విషయముకాదు - ఇది ఆయన ప్రత్యక్ష అనుభవం! అది మన కొలతలకు, కురచబుద్ధులకు అందేదికాదు. అది మన ఆలోచనలు ఆగినచోట అర్థమయ్యే అంతస్తు !

ఆత్మ అంటే ఏమిటో, పరబ్రహ్మము అంటే ఏమిటో, వేదాంతమున చెప్పబడిన ఆసద్వస్తువు అంటే ఏమిటో ఆయనకు తెలియదు. తెలుసుకోవాలనే కాంక్షకూడ లేదు. మరణించే ఈదేహానికి అతీతముగా మరణమేలేని అమృతవస్తువు ఒకటి ఉన్నదని తెలియని పదునారేండ్ల ప్రాయములో ఆయనకు ఈ మరణానుభవము కలిగినది. సాధనచేసి ఆయన ఋషికాలేదు. కేవలం మరణానుభవంతో ఆయన మనస్సు అంతర్ముఖమై దాని పుట్టుచోటైన హృదయాన్ని చేరుకొని అందులో అణిగిపోయినది. అంతే! వెంటనే ఆత్మ తానుగా వ్యక్తమైనది. ఇరువది నిముషముల తరువాత మరల శ్వాస కదిలినది. గుండె కొట్టుకున్నది. రక్తప్రసరణ ప్రారంభ మైనది. ఆదేహమే ఒక దేవాలయమైనది !

గురువు సహాయము లేకుండా, శాస్త్రశ్రవణము చేయకుండా, సాధనలతో నిమిత్తము లేకుండా, అసలు సత్యాత్మ అనేది ఒకటివున్నదని తెలియకుండా ఈసృష్టిలో ఆత్మానుభూతిని పొందినవారు మరొకరు లేరు-లేరు-లేరు. ఇది ఆధ్యాత్మిక జగత్తులోనే అద్భుతం - అపూర్వం! ఆయన పుట్టుకే ఈపుడమి తల్లికి ఒక గర్వకారణం !

"ఈ దేహము ఒక మంచికార్యము చేయుటకు ఇల్లువిడిచి పోవుచున్నది. దీని కోసము అన్వేషించవద్దు ఇట్లు" అని వ్రాశాడేగాని అక్కడ సంతకము పెట్టలేదు. సంతకం పెట్టేవాడు అక్కడ లేడు ! వ్యక్తిత్వము ఉన్నవాడికి పేరు - వ్యక్తిత్వమే లేనివాడికి పేరేముంటుంది? 1896 ఆగష్టు 29న ఆయన ఇల్లు విడిచి పెట్టాడు - సెప్టెంబరు 1న అరుణాచలక్షేత్రము చేరుకున్నాడు. అరుణాచలేశ్వరుణ్ణి దర్శించి "తండ్రి! నీవు పిలిస్తే నేను వచ్చాను" అని తనను తాను నివేదించు కున్నాడు.

కౌపీనధారియై పాతాళగుహలో కొంతకాలమున్నాడు. ఎవ్వరూ పలుకరించక చాలా రోజులు మౌనంగానే ఉండిపోయాడు - మౌనస్వామిగా పిలువబడ్డాడు. పవళకుండ్రులో నుండగా తల్లి అళగమ్మ వచ్చి, ఇంటికి తిరిగిరమ్మని ఎంతగానో రోదించినది. చాలాకాలము మౌనంగావున్నందున కాబోలు గొంతు స్వాధీనములోలేక, ఎవ్వరో పలకయిస్తే, ఆపలకమీద

తల్లికి తన తొలి సందేశాన్ని వ్రాసి యిచ్చాడు. "ఈశ్వరుడు జీవులను వారివారి ప్రారబ్ధములను అనుసరించి ఆడిస్తున్నాడు. జరుగవలసినది జరిగేతీరును - జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నముచేసినా జరుగనే జరుగదు - ఇది సత్యము. కనుక ఊరకవుండుట ఉత్తమము" అని వ్రాశాడు. ఈ మాటలయొక్క బరువు, వాటిలోతు మనకు అర్థమైతే మనలోపలవున్న దుఃఖమంతా యిప్పడే యిక్కడే ఆరిపోతుంది.

విరూపాక్ష గుహలోనుండగా 1907లో కావ్యకంఠ గణపతి మునీంద్రులు వచ్చి - "స్వామీ ! నేను చదువ వలసిన సకలశాస్త్రములు చదివితిని. తనివితీర మంత్రజపము చేసితిని. ఎంతో తపస్సు చేశాను - అయినా తపస్సు అంటే ఏమిటో నాకు తెలియతేదు స్వామీ!" అని ప్రార్థించారు. అంత స్వామి - "నేను, నేను అని అంటున్నారే - ఆనేను ఎక్కడినుంచి పుట్టుచున్నదో చూడండి - అక్కడనే మనస్సు లయిస్తుంది. అదే తపస్సు!" అని తపస్సునకే ఒక కొత్త నిర్వచనాన్ని చెప్పారు స్వామి. ఆ సమాధానానికి కావ్య కంఠులు సంతసించి, స్వామికి "భగవాన్ శ్రీరమణ మహర్షి" అని పేరు పెట్టారు.

1922లో స్కందాశ్రమంలోనుండగా తల్లి అళగమ్మకు మోక్షమును ప్రసాదించి, కొండదిగువన సమాధి చేశారు. ఆ సమాధే మాతృ భూతేశ్వర ఆలయముగా రూపుదిద్దుకొని, శ్రీరమణాశ్రమముగా వెలసినది. "నాచుట్టూ నాలుగుగోడలు కట్టి "రమణాశ్రమం" అని పేరు పెట్టారు. ఈ నాలుగు గోడల మధ్యన ఉన్నదే రమణాశ్రమంకాదు - ఈలోకమంతా నాఆశ్రమమే" అన్నారు స్వామి! హద్దులులేని, సరిహద్దులులేని ఆ హృదయపులోతులు ఎందరికి అందుతాయి? ఎందరెందరో దేశవిదేశాలనుంచి స్వామి సన్నిధికి వచ్చారు. కేవలము ఒక్క కంటిచూపుతోనే మౌనంగా ఎందరి హృదయాలలోనో జ్ఞానజ్యోతిని వెలిగించి, చైతన్యాన్ని మేల్కొలిపి, జీవితగమనాన్నే మార్చివేసి - వారి బ్రతుకులలో కాంతిని శాంతిని నింపిన శాంతి ప్రధాత ఆయన!

నోబుల్ బహుమతినందుకున్న ఒక అమెరికన్ శాస్త్రవేత్త- "నేను జీవితములో ఎంతో సాధించానని, ఎంతో తెలివిగలవాడినని అనుకునేవాడ్ని. కాని శ్రీరమణమహర్షిని చూశాక తెలిసినది - నాకు తెలిసినది చాలా స్వల్పమని, నేను జీవితములో నేర్చుకోవలసినది చాలావున్నదని" తన మిత్రులతో చెప్పాడు.

"రమణ సద్గురూ, రమణసద్గురూ" అని ఒక భక్తుడు పాడుతుంటే - "రమణసద్గురు అంటే ఎవరు? - ఈదేహమా? హరిమొదలు క్రిమికీటకాదుల వరకు అందరి హృదయాలలోను రమించేవాడే రమణుడు" అన్నారు స్వామి. స్వామి ప్రేమ మానవులకే పరిమితము కాదు - పశుపక్ష్యాదులనుకూడ ఆయన ఎంతగానో ప్రేమించారు. గోవులక్ష్మికి మోక్షము ప్రసాదించిన మోక్షప్రధాత ఆయన!

మేము సోషలిస్టులం, మేము సెక్యులరిస్టులం అని గొంతులు చించుకొంటూ, గుండెలు బాదుకుంటూ, తడిగుడ్డలతో అమాయకపు ప్రజల గొంతులుకోసే ఈలిస్టులందరు సోషలిస్టులౌనోకాదోగాని - రమణస్వామి ఈజ్ ఎ రియల్ సోషలిష్టు! ఆయన ఎప్పడు ఎవ్వరినికూడా "వాడు-వీడు" అని అనలేదు. కడకు పశుపక్ష్యాదులనుకూడా "అది-ఇది"

అని యెరుగరు - "వారు-వీరు" అని మన్నించేవారు. సమత ఆయన ఊపిరి. ప్రేమ ఆయన స్వరూపం. సకల జీవులపట్ల సమతను చూపి - మమతను పంచిన కారుణ్యమూర్తి ఆయన!.

ఆయన ఎప్పుడూ ఎవ్వరినీ "నాకిది కావాలి" అని నోరుతెరచి అడుగలేదు. అట్టి ఏమీ అడుగని స్వామి ఒకటిమాత్రము అడిగేవారు - "ఒక్కసారి ఈ కొండచుట్టూ ప్రదక్షిణ చేయండి" అని. "ఆకొండలో ఏముంది స్వామీ?" అని ఎవరైనా అడిగితే - "ఒకసారి ప్రదక్షిణ చేయండి - అది మీకే తెలుస్తుంది" అని చెప్పేవారు. "ఏమిటి స్వామీ - ఆ కొండదేవుడా?" అని ఎవరైనా ప్రశ్నిస్తే - ఈదేహము ఒక శవం! ఈశవాన్ని మీరనుకుంటే తప్పలేదుగాని - ఆకొండను నేను దేవుడని అంటే తప్పు వచ్చినదా?" అని ప్రశ్నించేవారు.

"స్వామీ! తమరు కుమారస్వామి అవతారమని గణపతిమునీంద్రులు చెపుతున్నారు - నిజమేనా?" అని ఒక భక్తుడు అడిగితే - "గుడిలోని రాయిని దేవుడని అనుకుంటున్నప్పుడు - ఈ దేహాన్ని కుమారస్వామి అంటే తప్పేముంది?" అని అన్నారేగాని, "ఔను" అని తన ఔన్నత్యాన్ని చాటుకోలేదు. "స్వామీ! మీ పేరుమీద ఒక పత్రిక పెట్టాలని వుంది" అని ఒక భక్తుడు అడిగితే - "సత్యానికి చాటింపు అక్కరలేదు" అన్నారు.

"స్వామీ! మీదయవల్ల మాకు ఈ ఉపకారం జరిగింది - ఆ ఉపకారం జరిగింది" అని ఎవరైనా భక్తులు చెపితే - "నీవు ఒకడవు వున్నావనీ, నీకు మేలు జరగాలనీ నేను అనుకుంటే నేను జ్ఞానిని అవుతానా?" అని ఖండించేవారు. "స్వామీ! మీదయవల్ల నేను ఇక్కడికి వచ్చాను" అని ఎవరైనా అంటే - "మరి నేనెవరి దయవలన ఇక్కడికి వచ్చాను?" అని ప్రశ్నించేవారు. ఇది స్వామివారి నిరహంకారస్థితికి, నిరభిమానస్థితికి పరాకాష్ట!

"స్వామీ! మీకు త్రిమూర్తులు ప్రత్యక్షమై ఏమి కావాలో కోరుకోమంటే మీరేమి కోరుకుంటారు?" అని ఒక భక్తుడు అడిగితే - "ఇంకెప్పుడు మీరు నాకు కనిపించవద్దని కోరుకుంటాను" అన్నారు స్వామి! అట్టిది వారి జ్ఞానవైభవం!

"స్వామీ! నాకు ఈలోకాన్నంతా ఉద్ధరించాలని ఉంది" అని ఎవరైనా అంటే - "మిమ్మల్ని మీరు ఉద్దరించుకున్నరా - ఈలోకాన్ని మీరు ఉద్ధరించటానికి? పోనీ ఈలోకం నన్ను ఉద్దరించవయ్యా అని మిమ్మల్ని ఎప్పుడైనా అడిగిందా? తింటానికి మెతుకులు లేనివాడు అన్న సత్రం పెడతానన్నాడట! మీరు బాగుపడకుండా, మీలో శాంతిలేకుండా మీరీలోకాన్ని బాగుచేయగలరా? ముందు మీరు బాగుపడండి. మీరు ఎంతవరకు అయితే బాగుపడతారో - అంత మేరకే ఈసమాజము బాగుపడుతుంది. అని సెల్ఫ్ రిఫార్మ్ (Self Reform) గురించి నొక్కి చెప్పేవారు.

"స్వామి! నేను మీకు ఏమీ తీసుకురాలేకపోయాను - వట్టి చేతులతో వచ్చాను" అని ఒక భక్తుడు బాధపడుతుంటే - "ఏమీ తీసుకురాలేదంటారేమిటి? నేనునేను అని అంటున్నారే - ఆ నేనును తీసుకువచ్చారుగదా? నాకు కావలసినది ఆనేనే! ఆనేనును భుజించటానికే నేను ఈ భూమి మీదకు దిగివచ్చాను" - వాడు భగవాన్ శ్రీరమణమహర్షి!

భగవాన్ విరూపాక్ష గుహలోనుండగా భక్తులు స్వామి తొలిపుట్టినరోజు పండుగను

చేస్తున్నప్పుడు - "ఈ శరీరం ఒక శవం! ఈశవాన్ని దండలతో అలంకరించి ఊరేగించేబదులు - కనీసము ఈశరీరము పుట్టినరోజునైనా ఈనేను అనునది ఎక్కడపుట్టుచున్నదో విచారణ చేయండి" అని చెప్పారు.

కవికులానికి కాళిదాసు ఎటువంటివాడో - ఋషికులానికి శ్రీరమణస్వామి అటువంటివారు. ఆయన చెప్పినమాటలు ఎంగిలిమాటలు కావు. తన స్వానుభవాన్ని "నేనెవడను?, ఉపదేశసారము, ఉన్నది నలుబది సద్విద్య" - అను గ్రంథములలో పొందుపరచారు. ఆయన వ్రాసిన "అరుణాచల అక్షరమణిమాల" నవరసభరితం! అందుకునే హృదయాలుంటే - నోబుల్ బహుమతి పొందవలసిన కావ్యమది.

చివరిరోజులలో స్వామిశరీరాన్ని కేన్సర్‌వ్యాధి పీడిస్తున్న టైములో - "స్వామి! కేన్సరు వ్యాధి వైద్యులకు లొంగుటలేదు. మీరు తలచుకుంటే అది తగ్గిపోతుంది" అని భక్తులు ప్రాధేయపడితే - "సరిసరి! తలచుకునేవాడు లోపలవుంటే తప్పకుండా తలచుకుంటాను. కాని తలుచుకునే వాడు లోపలలేడే! అయినా నేను దానిని రమ్మన్నానా - పొమ్మనటానికి? మీరందరు ఎలావచ్చారో - అది కూడ అలాగేవచ్చినది. కాకపోతే మీరువచ్చి దూరంగా కూర్చున్నారు - వీరువచ్చి భుజంమీద కూర్చున్నారు - అంతే తేడా! నాకు ఒక శరీరముందని, దానికి రెండు చేతులున్నాయని, అందులో ఒకచేతిమీద కేన్సరు వుందని మీరు చెబుతుంటే నాకు తెలుస్తున్నది. అసలు ఈ శరీరమే ఒకరోగం! రోగానికి రోగంరావటంలో ఆశ్చర్యమేముంది? జీవితములో ఎన్నో సంఘటనలు జరుగుతుంటాయి. అందులో చావు అనేది కూడ ఒక సంఘటన మాత్రమే! కాకపోతే జీవితములో అది చివరి సంఘటన! ఈరోజు పగటికి - రేపు పగటికి మధ్యన రాత్రిపూట మనము నిద్రపోయే నిద్ర ఎటువంటిదో - ఈ దేహానికి, రాబోయే దేహానికి మధ్యన చావు కూడా అటువంటిదే!" అన్నారు స్వామి. ఆయనకు ఆయన దేహానికి ఎంతదూర సంబంధమో!

చివరి రోజులలో స్వామి శరీరము బాగా నీరసించిపోయినదని ఆశ్రమంవారు భక్తులను స్వామిదర్శనానికి వెళ్ళకుండా నిరోధిస్తుంటే - "ఈ దేహానికి ఇంత మజ్జిగన్నము పెడుతున్నారు గదా? కనీసం దర్శనం యివ్వటానికైనా పనికిరానప్పుడు ఈ దేహానికి ఆ అన్నము మాత్రము దేనికి?" అని హాలు బయటికి వచ్చి కూర్చునేవారు - అదీ ఆయన దయార్ద్ర హృదయము!

1950 ఏప్రియల్ 14వ తేదీ రాత్రి గం॥ 8-47 లకు భగవాన్ దేహగతమైన చరిత్ర ముగిసి పోయినది. స్వామి శరీరము విడిచిపెట్టినప్పుడు ఒక పెద్దకాంతి ఆకాశములో పయనించి అరుణగిరి శిఖరములో కలిసిపోయినది. దానిని ప్రత్యక్షముగా ఎందరో తిలకించారు. దానికి సాక్ష్యం ఆనాటి న్యూసుపేపర్లే!

ఆయన కాంతి రూపములో ఈ భూమిమీద అవతరించాడు - అజ్ఞాన అంధకారములో అలమటిస్తున్న ఈలోకానికి ఎంతో కాంతిని ప్రసరించాడు - మరల కాంతిరూపములో ఈ భూమిని విడిచి వెళ్ళిపోయాడు. అలనాడు ద్వాపర యుగములో శ్రీకృష్ణపరమాత్మ జీవితంలో యిటువంటి సంఘటన జరిగినట్లు మన పురాణాలు చాటుతున్నాయి. అయినా దానిని మనలో కొందరు నమ్మకపోవచ్చును. కాని భగవాన్ శ్రీరమణమహర్షి నిన్నగాక మొన్నటివాడు - ఇది

మనము కాదనలేని సత్యము.

భగవద్గీతలో వాసుదేవస్వామి చెప్పిన స్థితప్రజ్ఞలక్షణాలను ఆచరించిచూపి, గీతకు జీవంపోసి, గీతకు గీటురాయిగా నిలిచిన ఋషివరేణ్యుడే భగవాన్ శ్రీరమణమహర్షి! "రక్తమాంసములతో కూడిన దేవుడు ఎలావుంటాడో నీకు చూడాలనివుంటే - భగవాన్ శ్రీరమణమహర్షిని చూడు" అని ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలోని తన విదేశీ మిత్రునికి జాబు వ్రాశారు మన మాజీ రాష్ట్రపతి రాధాకృష్ణన్!

శ్రీ రమణస్వామి చెప్పినది ధ్యానమార్గముకాదు - విచారణ మార్గము. ధ్యాన మార్గమంటే మనస్సును ఏకాగ్రపరచుట. ఏకాగ్రమైన మనస్సు అణిగి ఉంటుందేగాని అది నశించదు. నశించని మనస్సు మరల తిరిగి విజృంభించక మానదు. విచారణమార్గమంటే మనస్సును పరిశీలించుట - "అసలు మనస్సు అనేది వున్నదా?" అని మనస్సును శోధించుట మొదలుపెడితే - అది దాని మూలములో అణిగిపోతుంది - లేని మనస్సు లేనట్లు తెలుస్తుంది - ఉన్న ఆత్మ వ్యక్తమౌతుంది. ఆత్మ తానుగా వ్యక్తమైనవాడే నిజమైన సుఖి!

సృష్టి ప్రారంభమైనప్పటినుంచి మానవుడు దుఃఖ స్పర్శలేని సుఖము కోసము తపన పడుతున్నాడు. దేవుడిని తెలుసుకొనుటకూడ అందులో ఒక భాగము మాత్రమే! మరి ఆ నిజమైన సుఖం ఎక్కడవుంది? ఒక్క ఆత్మలో తప్ప ఈ సృష్టిలో సుఖము ఎక్కడా లేదు. అసలు ఉన్నది ఆత్మ ఒక్కటే! ఆత్మ అనంతము, అఖండము, అజరము, అమరము, అద్వితీయము, అనిర్వచనీయము, అవ్యయము, అభవము, అభౌతికము, అలౌకికము. అది సత్‌చిత్ ఆనంద స్వరూపము. సినిమా బొమ్మలకు తెర ఎలా ఆధారమో - ఈ సృష్టికి ఆత్మే ఆధారము. దానిని నీరు తడుపలేదు - నిప్పుకాల్చలేదు - గాలి కదుపలేదు. అది కాలాతీతము - ఊహాతీతము - గుణాతీతము.

నీటిలోనుంచి బుడగ వచ్చినట్లు ఆత్మలో నుంచి దేహపరిమితమైన "నేను" ఒకటి పుట్టుచున్నది. నేను పుట్టిన పిదప అఖిలము పుట్టుచున్నది. ఈ నేను అణిగిన అన్నియు అణగుచున్నవి. ఈ నేను అనెడి ఒంటిస్థంభము మీదనే ఈ సృష్టి అంతయు ఆధారపడి యున్నది. ఈ నేను పుట్టకముందు ఉన్నస్థితియే మనము ఆదిగా ఉన్నస్థితి. ఈ నేను అనునదియే ప్రథమ తలంపు, ప్రధానతలంపు, పునాది తలంపు - అదియే అహంకారము. రాగంవచ్చినా, ద్వేషం వచ్చినా, కామం వచ్చినా, క్రోధం వచ్చినా ఈ నేనుకే వచ్చుచున్నవి. ఈ నేను - దానికి వచ్చు తలంపులు కలిసి మనస్సు అయినది. ఈనేను పుట్టినప్పడే జీవుడు పుట్టాడు - మరల ఈనేను దాని మూలములో అణిగినప్పడే జీవుడు మరణిస్తాడు. ఈ శరీరము యొక్క పుట్టుక పుట్టుకాకాదు - మరణము మరణమూకాదు. శరీరము మరణించినప్పటికి - ఈ నేను మరణించదు. ఈ నేనుకు ఉన్న కోర్కెలు తీర్చుటకోసం - మరల ఒక కొత్త శరీరము వచ్చి ఈ నేనుకు తగులుకుంటుంది! కోరికలు ఉన్నంతకాలము ఏ జీవుడూ ఈ జనన మరణ చక్రములో నుంచి బయటపడలేడు.

మానవుడు తాను ఆత్మైయుండి, అది తన హృదయములో ప్రత్యక్షముగా ప్రకాశిస్తుంటే ఆ ఆత్మను తెలుసుకొనుటకు తన హృదయమును శోధించుటమాని, శాస్త్రములను శోధిస్తున్న

మానవ మానసమును హృదయమువైపు గురి పెట్టించుటకే "నేనెవడను?" అను విచారణ పద్ధతిని బోధించి ఒక నవ్యమార్గాన్ని ఆవిష్కరించారు శ్రీరమణాచార్యులు.

గాఢనిద్రలో మనకు నేను అను తలంపులేదు. అప్పుడు జీవుడులేడు, దేవుడులేడు, దేహంలేదు, లోకంలేదు. ఇవన్నీ లేనప్పుడుకూడ గాఢనిద్రలో మనము సుఖముగా వున్నాము. మరల మనకు మెలుకువరాగానే నేను అను తలంపు వచ్చుచున్నది. దాని వెనుకనే మిగిలిన అన్ని తలంపులు వచ్చు చున్నవి - మనలను అశాంతికి గురిచేయుచున్నవి. మనల్ని అశాంతికి గురిచేయుచున్న "ఈ నేను ఎవడు?" అని ప్రశ్నించుకొని, పరిశీలన ప్రారంభిస్తే - ఈ నేను అంతర్ముఖమై, దానికి వచ్చు తలంపుల నుంచి విడువడి, దాని మూలమును శోధిస్తూ, హృదయాన్ని చేరుకొని, ఆత్మలో అణిగిపోతుంది - ఆత్మే తానుగా వ్యక్తమౌతుంది. "ఆత్మ స్వరూపుడవైన నీవు - అహంగతమైన నీబుద్ధితో శోధించి - నిన్ను నీవు తెలుసుకో" - ఇదే రమణ సందేశం!

అనుక్షణము మనమందరము ఏదో ఒకటి ఆలోచిస్తూనే వున్నాము. వ్యవసాయదారుడు వ్యవసాయంగురించి, వైద్యుడు వైద్యం గురించి, లాయరు లాగురించి, వ్యాపారస్తుడు వ్యాపారం గురించి, భక్తుడు భగవంతుని గురించి ఆలోచిస్తూనే ఉన్నారు. మంచిఆలోచనలు ఉన్నవాడికి మంచిజన్మ రావచ్చును - చెడ్డఆలోచనలు ఉన్నవాడికి చెడ్డ జన్మ రావచ్చును - ఆలోచించేవాడు లోపల వున్నంత కాలము జన్మలు తప్పవు జన్మవస్తే దుఃఖము తప్పదు. మరి ఈ ఆలోచించే వాడి మాటేమిటి?

ఈఆలోచించేవాడిని గురించి మనల్ని ఆలోచింప చేయుటకే ఈ 20వ శతాబ్దములో శ్రీరమణావతారము ఈభూమిమీద అవతరించినదని, భావితరాలవారు భగవానునికి వాడవాడన గుడులుకట్టి పూజించే రోజు ఎంతో దూరంలేదని ప్రవచిస్తున్నారు. శ్రీరమణుల మానసపుత్రులు జిన్నూరు శ్రీనాన్నగారు.

శ్రీరమణదేవుల కృపకు పాత్రులై, జీవితపు ఆవలిఒడ్డును చేరుకొని అమృతమూర్తులై, ఆత్మసామ్రాజ్యానికి అధిపతులై, మోక్ష సింహాసనాన్ని అధిరోహించి - తన చూపులతో, సందేశాలతో, స్పర్శతో ఎందరో దేశవిదేశాలనుంచి వస్తున్న ముముక్షువులను చైతన్య వంతులుగా చేస్తున్నారు సద్గురువు శ్రీనాన్నగారు. ఇజాలపేరుతో, విప్లవాలపేరుతో వెర్రితలలు వేస్తున్న నేటితరానికి ఆయన విసిరిన సవాల్ - "కర్రల పెట్టి కొట్టుకుంటూ, కత్తులపెట్టి కుత్తుకలు కోసుకుంటూ, తుపాకులపెట్టి కాల్చుకుంటూ, బాంబులుపెట్టి పేల్చుకుంటూ, వీధులలో లూటీలు చేస్తూ, అరాచకాన్ని సృష్టిస్తూ - దానికి విప్లవమనో ఏదోపేరు పెడుతున్నారు - కాని అది విప్లవం కాదు - మీ మనస్సును మీరు సంస్కరించుకుంటే అదే నిజమైన విప్లవం - అంతకుమించిన విప్లవం లేనేలేదు" అని విప్లవానికే ఒకనూతన భాష్యం చెప్పారు శ్రీనాన్నగారు! అందుకునే హృదయాలువుంటే తరతరాలకు తరగని సందేశమిది!

రచన :

**డా॥ కె. రామారావు** MBBS

శ్రీరమణక్షేత్రం

జిన్నూరు - 534 265